క్లుప్తంగా

లోక్ అదాలత్ లో కేసుల సత్వర పరిష్కారం



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది రవిశంకర్ పట్నాయక్

కాకినాడ రూరల్: కేసులు సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదం చేస్తుందని, రాజీ చేసుకోవడానికి వీలున్న కేసులను ఇరువర్గాల కక్షిదారులు పరిష్కరించుకోవడం ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో న్యాయవాది పట్నాయక్ పాల్గొని ప్రసంగించారు. వచ్చే 8న జాతీయ లోక్ అదాలత్‌లు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాఘవరావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా



జాబ్‌మేళాలో నియామక ఉత్తర్వులు అందిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్: రోటరీక్లబ్ కాకినాడ స్మార్ట్‌సిటీ ఆధ్వర్యంలో సోమవారం ది ఆఫీస్ నిర్వహించిన జాబ్ మేళాలో పలువురికి నియామక ఉత్తర్వులు అందించినట్టు క్లబ్ అధ్యక్షుడులు పోతుల రాంజీ తెలిపారు. స్వాగ్ హోలిక్ వెబ్ సొల్యూషన్స్‌లో కంపెనీలో మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించిన యువతకు ఆయన అభినందనలు తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలతోపాటు జాబ్ మేళాలు కూడా నిర్వహించి నిరుద్యోగుల కలలను నెరవేరుస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రోటరీ సభ్యులు టి.రవి, క్లబ్ సెక్రటరీ స్వామి శేఖర్, మాజీ అధ్యక్షుడు సామంతుల అజయ్, జే మెహర్ తేజ, హర్ష పాల్గొన్నారు.

పోస్టల్ ఏటీఎం కార్డు లేక అవస్థలు

బాలాజీచెరువు: పోస్టల్ ఏటీఎం కార్డులు సరఫరా లేక తపాలా ఖాతాలు కలిగిన వారు అవస్థలు పడుతున్నారని పోస్టల్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోషియేషన్ కార్యదర్శి తురగా సూర్యారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే అంశాన్ని ఆలిండియా పోస్టల్ ఆర్ఎంఎస్ అసోషియేషన్ సెంట్రల్ హెడ్ ప్రెసిడెంట్ కే రాఘవేంద్రన్ సెంట్రల్ గవర్నమెంట్ దృష్టికి తీసుకెళ్లారని, త్వరలో కార్డులు పంపిణీకు చర్యలు తీసుకుంటామని బదులిచ్చారని తెలిపారు.

రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: రీ సర్వే పూర్తి స్థాయిలో జరగని మండలాలు పిఠాపురం, సామర్లకోట, కాజులూరు, తాళ్లరేవులలో రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో రీ సర్వేపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి పూర్తిస్థాయి విచారణ చేసి నివేదిక రూపొందించాలని, ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో వచ్చిన దరఖాస్తుల నిర్ణీత గడువులో చర్య తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో డీటీపీ చైనులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అప్పారావు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సమావేశం



విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న పార్టీ నాయకులు

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురంలో సోమవారం బీజేపీ నాయకులతో జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ప్రతీ కార్యకర్త వారి బూత్‌ల్లో కమిటీ సభ్యులను నియమించుకొని మండల, జిల్లాస్థాయి కమిటీలు బలోపేతం చేయాలన్నారు. అనంతరం ఇటీవల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బిక్కిన విశ్వేశ్వరరావును పార్టీ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కె.గంగరాజు, సంగడి సత్యం, చోడిశెట్టి రమేష్, మొసలగంటి సురేష్, మేడ విజయలక్ష్మి, బలరామకృష్ణ, నాగేశ్వరావు, బర్రె శ్రీను పాల్గొన్నారు.

నీరు పారేదెలా..?



తిమ్మాపురం వద్ద పేట కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క



తిమ్మాపురం పేట కాలువలో రంగు మారిన మురుగునీరు

- పేట కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క
- కలుషితమవుతున్న సాగునీరు
- ఇబ్బంది పడుతున్న రైతులు

కాకినాడ రూరల్: పంట కాలువలు, డ్రైనేజీలు సక్రమంగా ఉంటేనే నీరు పారుతుంది. అవి చెత్తాచెదారం, గుర్రపుడెక్క, పూడికతో మూసుకుపోతే సాగునీరు సక్రమంగా సాగదు. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం నుంచి నగరంలోని మధురానగర్ వద్ద గాడేరు వరకు విస్తరించి ఉన్న పేట కాలువ గుర్రపుడెక్కతో పేరుకుపోయింది. డ్రైనేజీగా పిలవబడే పేట కాలువకు తిమ్మాపురం ప్రాంతంలో పంట పొలాల్లో మిగులు జలాలతోపాటు వర్షపు నీరు చేరుతుంది. వర్షాకాలంలో పేట కాలువ ఉధృతంగా ప్రవహిస్తూ మధురానగర్ వద్ద లోతట్టు ప్రాంతాలను ముంపునకు గురి చేస్తుంది. సుమారు 5.5 కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ కాలువను పట్టించుకోకపోవడంతో గుర్రపుడెక్కతో నిండిపోయింది. కొన్నిచోట్ల కలుషిత జలాలు కాలువలోకి విడిచిపెట్టడంతో నీరు నలుపు రంగులోకి మారుతోంది. ఎక్కడ నీరు అక్కడ చందంగా నీరు పారక పోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. కాలువలో పూడికను తొలగించి, తూటిని పూర్తిగా తీసి వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కొన్ని చోట్ల కాలువను ఆనుకుని ఆక్రమణలు పెరగడంతో భవిషత్‌లో కాలువ మనుగడ ప్రశ్నార్థకమంగా మారనుంది.

తుపాన్లు వస్తే.. ఇబ్బందే

చూసేందుకు చిన్నదిగా ఉన్న ఈ పేట కాలువ ద్వారా వర్షాకాలంలో అధిక సంఖ్యలో నీరు పారుతోంది. తుపాన్ల సమయంలో నీరు వేగంగా పారకపోవడంతో అరుందతీనగర్, మారుతినగర్ వంటి ప్రాంతాలు ముంపునకు గరవుతున్నాయి. వీటిలో నిల్వ నీరు పేట కాలువ ద్వారానే పోవాల్సి ఉంది. ఉంది.

> **ప్రతిపాదనలు పంపాం**
>
> పేట కాలు తిమ్మాపురం నుంచి మధురానగర్‌లో గాడేరు వరకు విస్తరించి ఉంది. వేసవిలో క్లోజర్ వర్కుల్లో భాగం కాలువలో డీ సిల్టేజేషన్(పూడిక తొలగింపు), తూటి కాడ తొలగింపునకు ప్రతిపాదనలు చేశాం. నీటి వినియోగదారుల సంఘాలు అందుబాటులోకి రావడంతో వాటి ఆధ్వర్యంలో పనులు జరగనున్నాయి. ఇందుకు చర్యలు తీసుకుంటున్నాం.
>
> – వరప్రసాద్, ఇరిగేషన్ జేఈ, డ్రైనేజీ సెక్షన్

ప్రతి అధ్యాపకుడు నిరంతర విద్యార్థే



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు: ప్రతి అధ్యాపకుడు నిరంతర విద్యార్థిగా ఉంటూ కొత్త విషయాలు నేర్చుకోవాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే ఎన్ఐటీ వరంగల్ ఎలక్ట్రానిక్స్ అకాడమీ ఆధ్వర్యంలో అప్టిమైజ్ సోల్యూషన్ ఫర్ ఐసీ డిజైన్ విత్ హ్యాండ్స్ ఆన్ సెషన్ ఆన్ సీఎంఓఎస్ డిజైన్ అంశంపై వారం రోజుల పాటు నిర్వహించే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ అధ్యాపకులు ఎదైనా అంశాన్ని నేర్చుకుంటూ ఉంటే ఎంత కష్టమైన అంశమైన సులువుగా ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాపును వివిధ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెక్టార్ కేవీ రమణ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ రంగంలో అనేక అప్లికేషన్స్ రూపొందించుకునే అవకాశం ఉంటుందని, వాటిని సద్వినియోగం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్ర, డైరెక్టర్ కృష్ణప్రసాద్, మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాదరాజు, ఈసీఈ విభాగాధిపతి లీలాకుమారి, లీగల్ సెల్ డైరెక్టర్ బాలాజీ, మాజీ వీసీ కే పద్మరాజు, పద్మప్రియ పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ పర్యటన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తూ కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సోమవారం తెల్లవారు జాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా మార్కెట్ ట్యాంక్ ఏరియా సినిమా రోడ్డులో పారిశుధ్య పనుల నిర్వహణ తనిఖీ చేశారు. అనంతరం 2వ సర్కిల్‌లోని భాస్కర్‌నగర్, వెంకట్‌నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ భావన పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం



డాక్టర్ శైలజను సత్కరిస్తున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో సోమవారం జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడీఏ) కాకినాడ శాఖ ఆధ్వర్యంలో సంఘ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో మహిళా వైద్యులను సత్కరించారు. డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ, వైద్య పురోగతి, రోగుల సంరక్షణలో మహిళా వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. దేశ విదేశాల్లో ఎందరో మహిళా వైద్యులు ప్రజారోగ్య పరిరక్షణకు తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. డాక్టర్ యేరూష మాట్లాడుతూ, వైద్య వృత్తిలో మహిళలు పురుషులకు దీటుగా రాణిస్తున్నారని కొనియాడారు. సత్కార గ్రహీత డాక్టర్ శైలజ మాట్లాడుతూ, 1849లో యునైటెడ్ స్టేట్స్‌లో వైద్య పట్టా పొందిన మొదటి మహిళ డాక్టర్ ఎలిజబెత్ బ్లాక్‌వెల్ జయంతి ఫిబ్రవరి 3 సందర్భంగా జాతీయంగా మహిళా వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు ఏర్పాట్లు



హాకీ పోటీల ఏర్పాట్లపై ఆర్డీఓ మల్లిబాబుతో చర్చిస్తున్న జేసీ రాహుల్ మీనా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఈ నెల 15వ తేదీ నుంచి 28 తేదీ వరకు కాకినాడ క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో జరుగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లను సోమవారం డీఎస్ఏలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా వివిధ కమిటీలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. వివిధ రాష్ట్రాల నుంచి రానున్న హాకీ క్రీడాకారులకు కల్పించుకున్న సౌకర్యాలు, వసతులు, ప్రయాణ సౌకర్యాలు, వాహనాల పార్కింగ్, ఆహారం, ప్రారంభోత్సవం సాంస్కృతి కార్యక్రమాలకు అవసరమైన వేదికలు, మైదానంలోకి పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, లైటింగ్, సౌండ్ సిస్టం వంటి వాటిని పరిశీలించి జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ జాతీయస్థాయిలో జరిగే ఆల్ ఇండియా సర్వీసెస్ హాకీ టోర్నమెంటుకు కాకినాడ జిల్లా ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో పోటీల నిర్మాణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ హాకీ టోర్నమెంట్ నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లి బాబు, డీఎస్డీవో బి.శ్రీనివాస కుమార్, జిల్లా ఉపాధి శిక్షణ అధికారి జి.శ్రీనివాసరావు, వికాస పీడీ కె.లచ్చారావు, పెదపూడి, కాకినాడ రూరల్ తహసీల్దార్లు పీవీ సీతాపతి రావు, ఎస్ఎల్ఎస్ కుమారి, డీఎస్ఏ హాకీ కోచ్ నాగేంద్ర, హాకీ సంఘ ప్రతినిధి రవిరాజు ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

టెన్నిస్ పోటీలు ప్రారంభం



టెన్నిస్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రూరల్ ఎమ్మెల్యే నానాజీ

నాగమల్లితోట జంక్షన్: కాకినాడలో నూతన టెన్నిస్ కోర్టులు ఏర్పాటుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. సోమవారం కాకినాడ జిల్లా క్రీడామైదానంలో ఏపీ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆల్‌ఇండియా అండర్–16 టెన్నిస్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఏపీ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పీవీ రామ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ డీఎస్ఏ టెన్నిస్ కోర్టుల్లో జరిగే పోటీల్లో కర్నాటక, తమిళనాడు, ఏపీ, తెలంగాణ నుంచి 54 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని ఏపీలాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి రామ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శేషగిరి, ఆర్ఎంసీ మాజీ ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఎల్ సత్యనారాయణ (టిక్కు) తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమికి ఆలయాల్లో భారీ ఏర్పాట్లు



రథసప్తమి వేడుకలకు ముస్తాబైన భానుగుడి సూర్యనారాయమూర్తి ఆలయం



పెద్దమార్కెట్‌లో రేగుపళ్లు, ఆవుపిడకలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

బోట్‌క్లబ్: రథసప్తమి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించేందుకు కాకినాడ నగరంలోని పలు సూర్యనారాయణమూర్తి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆయా ఆలయ కమిటీలు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాల వద్ద తోపులాట జరుగకుండా భారీకేట్లు, క్యూలో ఉన్న భక్తులకు మంచినీరు ప్యాకెట్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక భానుగుడి వద్ద ఉన్న ఉషాఛాయాదేవి సమేత సూర్యనారాయణమూర్తి దేవస్థానం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్టు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 8న సూర్యనారాయణమూర్తి కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. స్థానిక బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ఉదయం నుంచి స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్టు ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి తెలిపారు. సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా జరగనుందని తెలిపారు. స్థానిక సంత చెరువు వద్ద ఉన్న సూర్యనారాయణస్వామి దేవస్థానంలోను, అయ్యప్పస్వామి దేవస్థానంలో ఉన్న సూర్యనారాయణస్వామి దేవస్థానంలో రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొండెక్కిన పూజా సామగ్రి

రథసప్తమి వేడుకులకు ఉపయోగించే పూజా సామగ్రి ధరలు కొండెక్కాయి. పూజకు ఉపయోగించే చెరకు గడ, రేగుపళ్లు, ఆవుపిడకలు వంటి రేట్లు భారీగా పెరిగాయి. చెరకు గడ రూ.10, చిన్నగ్లాసు రేగుపళ్లు రూ.20, ఐదు ఆవుపిడకలు రూ. 30 పెరిగిపోయాయి. గత సంవత్సరం ఈ రేట్లు సగం ఉండగా ప్రస్తుతం రెట్టింపయ్యాయని భక్తులు చెబుతున్నారు. రథసప్తమి సందర్భంగా పూజా సాయగ్రి విక్రయించే దుకాణాలతో నగరంలోని గురువారం పలు ప్రాంతాలు బిజీగా మారాయి. స్థానిక భానుగుడి, అశోక్‌నగర్, గాంధీనగర్, సర్పవరం జంక్షన్, రామారావుపేట, బాలాజీచెరువు సెంటర్, పెదమార్కెట్ వంటి ప్రాంతాల్లో రోడ్డుపై దుకాణాలు అధికంగా వెలిశాయి.

యోగా క్రీడాకారులకు అభినందనలు



యోగా క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్

నాగమల్లితోట జంక్షన్: బెంగళూరుకు చెందిన శివజ్యోతి యోగా కేంద్రం ఆధ్వర్యంలో జనవరి 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరిగిన యోగా ఆన్‌లైన్ పోటీల్లో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో యోగా క్రీడాకారులు పాల్గొని ప్రతిభను కనపరిచారని డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ సోమవారం తెలిపారు. ఈపోటీల్లో పాల్గొన్న 30 మంది యోగా క్రీడాకారులు సర్టిఫికెట్లు, షీల్డ్స్ గెలుచుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ యోగా పోటీల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను, యోగా కోచ్ ఇందిరాదేవిలను డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ డీఎస్ఏ యోగా హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి దంపతులు

కాకినాడ సిటీ: స్థానిక సాంబమూర్తినగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

మహా కుంభ మేళాకు బస్సు సర్వీసులు



మహా కుంభమేళాకు వెళ్లే బస్సులను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

కాకినాడ సిటీ: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయోగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాకు కాకినాడ డిపో నుంచి వెళ్లే సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సులను సోమవారం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ ఎంవీవీ మనోహర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సులు కాకినాడ నుంచి బయలుదేరి భువనేశ్వర్, పూరి, కోణార్క్‌ల మీదుగా ప్రయోగ్‌రాజ్‌కు చేరుకుని అక్కడ త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు పూర్తి అయిన తరువాత తిరుగు ప్రయాణంలో వారణాసి, గయా, బుద్ధగయ క్షేత్రాలు చూపించి తిరిగి ఈ నెల 11న కాకినాడకు చేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ కె.ప్రభాకరావు, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఫీజు పోరుకు బీసీలందరం మద్దతు ఇద్దాం

కాకినాడ సిటీ: స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయంబర్స్‌మెంట్ ముఖ్య ఉద్దేశం ఆర్థిక కారణాలతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకు దూరంకాకూడదని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా కాలక్షేపం చేస్తోందని జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు, కాకినాడ స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్, బీసీ జేఏసీ కన్వీనర్ అల్లి రాజబాబు యాదవ్ అన్నారు. ఫీజు రీయంబర్స్ మెంట్‌ను అమలు చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ చేపట్టిన ఫీజుపోరుకు మద్దతు ఇచ్చి తోడుగా నిలుద్దామని ఆయన అన్నారు. తామంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటూ ఫీజు పోరులో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఎస్సీ, బీసీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు, తల్లులు పాల్గొంటున్నారని రాజబాబు అన్నారు.

ఆర్థిక సాయం

కొత్తపల్లి: అమీనాబాదు గ్రామానికి చెందిన మత్స్యకార మహిళ కంబాల కొండమ్మ అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందింది. ఆమె కుటుంబానికి అదే గ్రామానికి చెందిన మత్స్యకార నాయకురాలు మడదా రాజేశ్వరి ఆ కుటుంబాన్ని సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, ఆర్థిక సహాయం అందించారు.

ఘనంగా సరస్వతీ పూజలు



శ్రీపీఠంలో సరస్వతి పూజల్లో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులతో సరస్వతీ పూజ చేయిస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: రమణయ్యపేట శ్రీపీఠంలో శ్రీ పంచమిని పురస్కరించుని సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐశ్వర్యాంబిక అమ్మవారిని సరస్వతీ దేవి అలంకరణలో అలంకరించారు. విద్యార్థులతో పరిపూర్ణానంద సరస్వతీ స్వామి పూజలు నిర్వహించి, అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం సరస్వతి హోమం నిర్వహించారు. విద్యార్థులకు సరస్వతి కటాక్షం సిద్ధించాలని పరిపూర్ణనంద స్వామి ఆశీర్వచనాలు అందించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో సరస్వతి దేవి పూజలు నిర్వహించి, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీచ చేశారు.

చిన్నారులకు అక్షరాభాస్యం



ప్రజా విద్యాలయంలో అక్షరాభాస్యం

బోట్‌క్లబ్: స్థానిక ప్రజా విద్యాలయంలో సోమవారం పలువురు చిన్నారులకు అక్షరాభాస్యం చేయించారు. ప్రజా విద్యాలయం నిర్వాహకులు వక్కలంక రామకృష్ణ చిన్నారులకు అక్షరాభాస్యం చేయించి వారికి పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్కలంక రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా విద్యాలయంలో ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. చిన్నారులతో అక్షరాభాస్యం చేయించే అదృష్టం తనకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని ప్రభుత్వ హైస్కూల్, తోట గోపాలకృష్ణ మున్సిపల్ హై స్కూళ్లను ఆయన పరిశీలించారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్ సక్రమంగా అమలు చేయాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఈ మేరకు ప్రతి వారం సీ, డీ గ్రేడ్ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులను నిర్వహించి వాటికి విద్యార్థులు తప్పని సరిగా హాజరయ్యేలా తల్లిదండ్రుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు తెలుగు, ఇంగ్లిషు అంశాలలో రాత నైపుణ్యాలను మెరుగు పర్చుకునేలా చూడాలన్నారు. ఇదే సమయంలో ఇంగ్లీషు, తెలుగు పాఠ్యాంశాలను తరగతి గదిలో చదివించాలన్నారు. గణితానికి సంబంధించి కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారంపై పట్టు సాధించేలా చూడాలని తెలిపారు. మరో వారంలో పాఠశాలకు తనిఖీకి వస్తానని ఉపాధ్యాయులు, విద్యార్థులలో మార్పులు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారులు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, హెచ్ఎంలు ప్రసూన, టి.శ్యామ్ సుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.